
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల జిల్లా వార్తలు

5★★

గురువారం 24 ఏప్రిల్ 2025



కోరుట్ల మండలం మాదాపూర్‌లో నేలరాలిన మామిడి







పంట నష్టాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ (ఫైల్)

పరిహారం అందేదెన్నడో..?

- ప్రతీ యేడు ప్రకృతి వైపరీత్యాలతో దెబ్బతింటున్న పంటలు
- అటకెక్కిన పంట బీమా పథకాలు
- నష్టపరిహారం కోసం అన్నదాతల ఎదురుచూపులు

జగిత్యాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రతీ సంవత్సరం ప్రకృతి వైపరీత్యాలతో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతింటున్నా ప్రభుత్వం పరిహారం చెల్లించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి డివిజన్లలో అకాల వర్షం, వడగళ్లు కురవడంతో పలు పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా మామిడి, వరి, మొక్కజొన్న, నువ్వు పంటలకు అపార నష్టం వాటిల్లింది. వేసవిలో కురిసిన అకాల వర్షాలు, వడగళ్లు, ఈదురు గాలులు అన్నదాతలను అతలాకుతలం చేశాయి. ఈదురు గాలుల ధాటికి మామిడికాయలు నేలరాలగా వడ్లు తడిచి ముద్దయ్యాయి. ఎకరానికి రూ.40 వేల నుంచి 50వేల రూపాయలు పెట్టు బడి పెట్టామని, కోత సమయానికి గాలి, అకాల వర్షం వచ్చి నష్టం కలిగించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● రెండు నెలల్లో నష్టం ఇలా..

జిల్లాలో గత నెల 21వ తేదీ నుంచి 25వ తేదీ మధ్య పలుమార్లు కురిసిన అకాల వర్షం, ఈదురు గాలులతో పలు పంటలు దెబ్బతిన్నాయి. జిల్లా వ్యాప్తంగా పది మండలాల్లో 1,036.31 ఎకరాలలో వరి, మొక్కజొన్న, ఇతర పంటలను 1,843 మంది రైతులు నష్టపోయినట్లు అధికారులు గుర్తించారు. బీర్‌పూర్, బుగ్గారం, ధర్మపురి, ఎండపల్లి, గొల్లపల్లి, జగిత్యాలరూరల్, మేడిపల్లి, పెగడపల్లి, సారంగాపూర్, వెల్గటూరు మండలాల్లో వరి 592.6 ఎకరాలు, మొక్కజొన్న 444.12 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. ధర్మపురి మండలంలో 580.5 ఎకరాల్లో వరి, గొల్లపల్లి మండలంలో 153.36 ఎకరాల్లో మొక్కజొన్న, జగిత్యాల రూరల్‌లో 184.33 ఎకరాల్లో మొక్కజొన్న పంటనష్టానికి గురైనట్లు అధికారుల పరిశీలనలో తేలింది. ఈనెల 18న కురిసిన అకాల వర్షంతో మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, కథలాపూర్, కోరుట్ల రూరల్, భీమారం మండలాల్లో 12,050 మంది రైతులకు చెందిన 11,491 ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు అధికారులు గుర్తించారు. ఇందులో 7,006 రైతులకు చెందిన వరి 5,565 ఎకరాల్లో, 2,069 రైతులకు చెందిన నువ్వు 1,751 ఎకరాల్లో , 1,714 మంది రైతులకు చెందిన బాజ్ర 1,512 ఎకరాల్లో, 255 మంది రైతులకు చెందిన మొక్కజొన్న 305 ఎకరాల్లో, 1,006 మంది రైతులకు చెందిన మామిడి 2,358 ఎకరాల్లో నష్టపోయినట్లు అధికారులు తేల్చారు.

● జిల్లాలో మూడేళ్లలో పంట నష్టం..

జిల్లాలో 2021 వానాకాలం సీజన్‌లో అధిక వర్షాలతో 30వేల ఎకరాల్లో, యాసంగి సీజన్‌లో వడగళ్లతో 12వేల ఎకరాల్లో రైతులు పంట నష్టపోయారు. 2022 వానాకాలం సీజన్‌లో 12,588 మంది రైతులకు 22,993 ఎకరాల్లో ఆరుతడి, 4,130 మంది ఎకరాల్లో వరి దెబ్బతిన్నాయి. 2023 మార్చి, ఏప్రిల్ మాసాల్లో దెబ్బతిన్న పంటలకు ఎకరాలకు రూ.10 వేల చొప్పున పరిహారం ఇస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. మార్చిలో 6,199 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో 532 ఎకరాలకు మాత్రమే పరిహారం అందించారు. ఏప్రిల్ మాసంలో 52 వేల ఎకరాల్లో మామిడి, వరి, నువ్వు, మొక్కజొన్న, జొన్న తదితర పంటలకు నష్టం జరిగినప్పటికీ పరిహారం అందించలేదు. 2023 వానాకాలం సీజన్‌లో భారీ వర్షాల వల్ల 14,065 మంది రైతులకు చెందిన 15,487 ఎకరాల్లో వివిధ పంటలు, 2024 వానాకాలం సీజన్‌లో జిల్లాలో భారీ వర్షాలతో 9 వేల ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు.

● పత్తాలేని బీమా పథకాలు..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో పలు బీమా పథకాలు అమలు చేసేవి. ఇందులో పంట బీమా పథకం (ఫసల్ బీమా యోజన), వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాలు ఉన్నాయి. ఈ పథకాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొంత ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తుండగా, మరికొంత రైతులు చెల్లించాల్సి ఉండేది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచి రాష్ట్రం వాటా చెల్లించకపోవడంతో ఫసల్ బీమా యోజన పథకం అమలు కావడం లేదని సంబంధిత వర్గాలు అంటున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు, వడగళ్లు, ఈదురు గాలుల వంటి వాతావరణ మార్పులతో మామిడి, మిరప, పత్తి పంటలు నష్టపోతే ఆయా పంటలకు పరిహారం అందించేలా ప్రభుత్వం వాతావరణ బీమా పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకంలో రైతులు..

మిగతా 8లో

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పెగడపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో రైతులకు అందుబాటులో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పశు సంపద కలిగిన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ హేమలత పేర్కొన్నారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాలలో గాలికుంటు నివారణ టీకాలు వేసే శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. శిబిరంలో పశువైద్య సిబ్బంది, గోపాల మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు

బీర్‌పూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు ఉంటాయని ఉద్యాన అధికారి స్వాతి అన్నారు. బుధవారం బీర్‌పూర్ మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించడానికి రైతులకు జిల్లాలోని వ్యవసాయశాఖ ఉద్యానశాఖ మరియు లోహియా ఎడిబుల్ ఆయిల్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో అవగాహన సదస్సులను ఏర్పాటు చేశామని తెలిపారు. మండలంలో కొత్తగా సాగు చేయాడానికి ముందుకు వచ్చే రైతులకు ఆయిల్‌పామ్ మొక్కలను సబ్సిడీపై అందించడం జరుగుతుందని అన్నారు. తోటల్లో మొదటి మూడు సంవత్సరాలు పత్తి, మొక్కజొన్న, పసుపు, అరటి, బొప్పాయి, కూరగాయల లాంటి అంతర్ పంటలను వేసుకోవచ్చన్నారు. తోటల నిర్వహణ నిమిత్తం ఒక ఎకరాకు సంవత్సరానికి 4200 చొప్పున నాలుగు సంవత్సరాల వరకు రైతులకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం ఆయిల్ పామ్ టన్ను ధర రూ.21,000 ఉందన్నారు. ఎకరానికి ప్రతి సంవత్సరం కనీసం 1,00,000 నికర ఆదాయం పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో లోహియా కంపెనీ సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ ఎల్. రాజేష్, కార్యదర్శి రవి, ఏఈవో శిరీష, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

'పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక'

జగిత్యాల, ఏప్రిల్23 (ఆంధ్ర జ్యోతి): పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ మీటింగ్‌హాల్లో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ బీఎస్‌లతతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు మంజూరు కోసం సొంత స్థలం కలిగి ఇండ్లు లేని నిరు పేదలను గుర్తించాల్సిన అవసర ముందన్నారు. జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల్లో నలుగురిని గెజిటెడ్ స్పెషల్ ఆఫీసర్‌లను నియామకం చేయడం జరిగిం దన్నారు. ఆయా నియోజకవర్గాల్లో మండలాల వారిగా కమిటీలు ఏర్పాటుచేసి పకడ్బందీగా దరఖాస్తులు చేసుకున్నవారికి వెరిఫికేషన్ చేయాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్లకు అర్హులను గుర్తించుటకు ప్రభుత్వం మార్గదర్శకాలను పాటించాలన్నారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారునిగా ఎంపిక కావాలంటే 2.5ఎకరాల పైన వ్యవసాయ భూమి కలిగి ఉండరాదని, సొంత కారు ఉండరాదన్నారు. కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఉద్యోగం కలిగి ఉంటే అనర్హులన్నారు. వలస వెళ్ళిన వారై ఉండరాదని, ఆదాయపు పన్ను చెల్లించిన వారు అనర్హులని ఆయన స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తప్పని సరిగా దారిద్ర రేఖకు దిగువన ఉండాలన్న మార్గదర్శకాలున్నాయన్నారు. కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ, రెవెన్యూడివిజనల్ అధికారులు, గృహనిర్మాణశాఖ అధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



కథలాపూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

నిర్మాణాలు వేగవంతం చేయాలి

కథలాపూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. మండలంలోని పోసానిపేటలో బుధవారం ఇళ్ళ నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. లబ్ధిదారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ ఉండాలని ఎలాంటి సందేహాలు ఉన్నా పరిష్కరించాలని అన్నారు. నిర్మాణ ప్రగతిని ఇంజినీర్లు పర్యవేక్షిస్తూ రికార్డులు చేయాలన్నారు. అనంతరం పోసానిపేట, దుంపెట కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులకు అసౌకర్యాలు ఏర్పడకుండా చూడాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శంకర్, ఏపీఎం నరహరి, ఆర్ఐ నగేశ్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి సులోచన తదితరులు ఉన్నారు.

భూ భారతిని సద్వినియోగం చేసుకోవాలి

కథలాపూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూత నంగా అమలులోకి తెచ్చిన భూభారతి 2025 ఆర్ఓఆర్ చట్టం రైతాంగం సద్వినియోగం చేసుకో వాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంకు హాజరై మాట్లాడారు. కొత్త చట్టంలో వస్తున్న పలు రకాల మార్పుల గురించి వివరించారు. 2020 నుంచి పెండింగ్‌లో ఉన్న 9 లక్షల సాదాబైనామా దరఖాస్తులకు ఈ చట్టంతో మోక్షం లభించనుందన్నారు. విరాసత్ పట్టాల విషయంలో ఉన్నతాధి కారులకు అప్పీల్ చేసుకునే అవకాశం కూడా ఇవ్వనున్నారని చెప్పారు. లావుణి పట్టాల విషయంలో కూడా సులభతరంగా ప్రస్తుతం మోఖా మీద ఉండి సాగు చేసుకుంటున్న వారికి న్యాయం జరగబోతోందిని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్‌డీఓ జీవాకర్‌రెడ్డి, తహసీల్దార్ వినోద్, ఆర్ఐ నగేశ్, ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పులి శిరీష, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం

● కలెక్టర్ సత్యప్రసాద్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



జగిత్యాల, ఏప్రిల్ 23 (ఆంధ్ర జ్యోతి): ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నానని.. సంక్షేమాన్ని ప్రజలకు చేరవేస్తూ అభివృద్ధి పథంలో జిల్లాను ముందుకు నడిపించేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు పై 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో కలెక్టర్ పలు విషయాలను వివరించారు.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల అమలు ఎలా ఉంది..?

కలెక్టర్ : ప్రభుత్వ లక్ష్యం మేరకు పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు పూర్తి చేయడంలో జిల్లా అధికార యంత్రాంగంతో పాటు ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో ముందుకు వెళ్తున్నాం. ప్రజలతో మమేకమవుతూ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి : భూ భారతి అవగాహన సదస్సుల్లో ప్రజా స్పందన ఎలా ఉంది..?

కలెక్టర్ : ధరణి కార్యక్రమంలో పరిష్కారం కాని పలు సమస్యలకు భూ భారతిలో పరిష్కరించే అవకాశాలుండడంతో ప్రజలు స్వాగతిస్తున్నారు. భూ భారతిలో రెండంచెల విధానం అమలు కానుంది. తహసీల్దార్ పరిధిలో పరిష్కారం కాని సమస్యకు ఆర్డీవోకు అప్పీలు, ఆర్డీవో వద్ద పరిష్కారం కాకుంటే కలెక్టర్, ఆ పై అధికారికి అప్పీలు చేసుకొని పరిష్కరించుకోవచ్చు. వచ్చే నెలలో జిల్లాలో సైతం భూ భారతిని పైలెట్ గ్రామాల్లో అమలు చేసే ప్రయత్నాలు చేస్తున్నాం. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో ఇంటర్ పరీక్షా ఫలితాలపై మీ స్పందన ఏమిటి?

కలెక్టర్ : గత విద్యా సంవత్సరం కంటే ప్రస్తుత విద్యా సంవత్సరం ఇంటర్ పరీక్ష ఫలితాలు జిల్లాలో మెరుగ్గానే వచ్చాయి. అయితే రాష్ట్ర స్థాయి సగటు శాతంతో పోలిస్తే జిల్లాకు వచ్చిన ఫలితాలు తక్కువగానే ఉంది. ఇంటర్ ఫలితాల తీరుపై సమీక్షించాల్సి ఉంది. కొన్ని కళాశాలలు ఆశించిన స్థాయిలో ఫలితాలను తీసుకొని రాలేకపోయాయి. ఇందుకు గల కారణాలను గుర్తిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : ధాన్యం తూకం వేయడంలో జాప్యం జరుగుతోందన్న ఆరోపణలపై మీ స్పందన ఏంటి?

కలెక్టర్ : ధాన్యం కొనుగోళ్ల కోసం మెజార్టీ కేంద్రాలను ఇప్పటికే తెరిచాం. రైతు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొని వచ్చిన వెంటనే కొనుగోళ్లు వేగవంతంగా జరిగేలా ప్రయత్నిస్తున్నాం. ఇప్పుడిప్పుడే ధాన్యం కొనుగోళ్లు పుంజుకుంటున్నాయి. కేంద్రాలను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ అధికారులు, ఉద్యోగులకు పలు సలహాలు, సూచలను ఇస్తున్నా. ఎక్కడైనా రైతులకు ఇబ్బందులు ఎదురైతే నా దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తా.

ఆంధ్రజ్యోతి : ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని అరికట్టడంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కలెక్టర్ : ఇటీవల జిల్లాలో పలువురు అధికారులు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులకు ప్రజలు ఎలాంటి లంచాలు ఇవ్వకూడదు. అలా ఎక్కడైనా ప్రభుత్వ ఉద్యోగులు డిమాండ్ చేస్తే సంబంధిత అధికారులను సంప్రదిస్తే చర్యలు తీసుకుంటాం. అవినీతి నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం.

ఆంధ్రజ్యోతి : మున్సిపాలిటీల్లో వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలు రూపొందించారా?

కలెక్టర్ : జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. రానున్న ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనా, ఆదాయ, వ్యయాలు పూర్తి చేశాం. ఆయా మున్సిపాలిటీలను బట్టి జీతాలు, పారిశుధ్యం, కరెంటు ఖర్చులు, రుణాల చెల్లింపు, మిగులు బడ్జెట్‌పై అంచనాలు రూపొందించాం.

'పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి'

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో పుస్తక పఠనం పట్ల ఆసక్తి కలిగించడం, సాహిత్యం పట్ల అవగామన కలిగించడం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ నాయకులు గౌరిశెట్టి విశ్వనాథం, పిసి హన్మంత్ రెడ్డి, బొల్లం విజయ్, డిండిగాల విఠల్, వెల్ముల ప్రకాష్‌రావు, శావణి, ఎండి యకూబ్ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలి'

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ఈనెల 27న వరంగల్ ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు భారీగా ప్రజలు, కార్యకర్తలు తరలి రావాలని మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ విజ్ఞప్తి చేశారు. జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం, చల్‌గల్ గ్రామాల్లో ఆమె మంగళవారం పర్యటించి గ్రామాల క్లస్టర్ ముఖ్యనాయకులు, బస్సు ఇన్‌ఛార్జి లతో బీఆర్ఎస్‌పార్టీ నిర్వహిస్తున్న రజతోత్సవసభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కేసీఆర్ చేసిన అభివృద్ధి కనబడుతుందన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, మాజీ సర్పంచులు తిరుపతి, లక్ష్మన్‌రావు పాల్గొన్నారు. జగిత్యాలరూరల్ మండలం మోరపల్లిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అబ్బలేబీ ఇల్లు దగ్ధం కాగా ఆమె పరామర్శించారు.

బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సమావేశం

రాయికల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్నపెల్లి గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బర్కం మల్లేష్, మండల, పట్టణ కో ఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి పాల్గొని ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించినున్న రజతోత్సవ సభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా, గ్రామ శాఖ అధ్యక్షుడు అంతం రవీందర్, నాయకులు పెంద్రం శ్రీనివాస్, మహేష్, భూమేష్, నరేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'సైన్స్ ల్యాబ్‌తో విజ్ఞాన సముపార్జన'



సైన్స్ ల్యాబ్‌కు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్23 (ఆంధ్ర జ్యోతి): సైన్స్ ల్యాబ్‌తో విజ్ఞాన సముపార్జన సాధ్యం అవుతుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక గర్ల్స్ హై స్కూల్‌లో పీఎంశ్రీ నిధులు రూ.13.5లక్షలతో సైన్స్‌ల్యాబ్ భవన నిర్మాణానికి ఆయన బుధవారం భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లా డుతూ ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఇప్పటికే ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో రూ.5కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం అయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో భీమయ్య, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, హెచ్ఎం రామానుజన్ పాల్గొన్నారు.

●జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కన్నాపూర్, కుర్మపల్లె గ్రామస్థులు బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డాక్టర్ సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన ఎమ్మెల్యే విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

●జగిత్యాల అర్బన్ : రాష్ట్రంలోనే అతిపెద్ద డబుల బెడ్‌రూమ్ ప్రాజెక్ట్ నూకపెల్లిదని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల పట్టణంలోని నూకపెల్లి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో జరుగుతున్న మౌళిక వసతుల నిర్మాణాలను మున్సిపల్ కమీషనర్ తో కలిసి ఆయన పరిశీలించారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

రాయికల్: రైతులు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. మండలంలోని అల్లీపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్ర మంలో పీఏసీఎస్ చైర్మన్ రాజలింగం, తహసీల్దార్ ఖయ్యూం పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని మండల విద్యాధికారి మధు అన్నారు. బుధవారం మండలంలో గోధుర్ ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో బడి బాట కార్యక్రమం కరపత్రంను అయన ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిబాట కార్యాచరణను గురించి వివరించారు. పాఠశాలకు చివరి పని దినం కావటంతో సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థుల చేత ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ లో భాగంగా మన దేశంలో నివసిస్తున్న ప్రజల యొక్క వేషధారణ వేయించి, ర్యాంపు వాక్ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంబెర్ మానర్, ఉపాధ్యాయులు గుంటుక రఘునాథ్, సామల్ల విజయ, తుమ్మ యమున, ఎఏపిసి చైర్ పర్సన్ సునీత , ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'రోగులకు మందులు అందుబాటులో ఉంచాలి'

కొడిమ్యాల, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి) : ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో పరిశీలించారు. ఆసుపత్రిలో చేస్తున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఫార్మసీలో మందులను, రికార్డులను పరిశీలించారు. ఎండదెబ్బ బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మండలంలోని తిప్పయ్యపల్లి గ్రామంలోని ఆరోగ్య మందిర్‌ను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ఎన్‌క్వాస్ కార్యక్రమం పనులను పరిశీలించారు. గర్భవతులు, చిన్న పిల్లల రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారులు పరమేశ్వరీ, నరేష్, సీహెచ్‌వో రాజశేఖర్, ఎంఎల్‌హెచ్ మహిపాల్, ఫార్మాసిస్ట్ శ్రీలత, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఉన్నారు.

వసతిగృహాల నిర్మాణానికి మోక్షమెప్పుడో..?

7

- కొండగట్టు పర్యటనలో ఏపీ డిప్యూటీ సీఎంకు అధికారుల వినతి
- అంజన్న ఘాట్ రోడ్డు సమీపంలో టీటీడీ ఇంజనీరింగ్ అధికారుల స్థల పరిశీలన
- పనులు ప్రారంభించకపోవడంతో భక్తుల ఇక్కట్లు

రోడ్డు ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై కేసు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదానికి కారణమైన సంఘటనలో మండల కేంద్రానికి చెందిన వాహన డ్రైవర్ మేఘ రాజుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ బుధవారం తెలిపారు. ఈనెల 22న రాత్రి పెద్దపల్లి జిల్లాలోని రాఘాపూర్‌కు చెందిన ఏనుగుల సదయ్య తన వరికోత యంత్రంతో మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లోని వరికోసి ఎల్లారెడ్డిపేట వైపు వెళ్తున్నాడన్నారు. మండల కేంద్రంలోని మేఘరాజు కారును అతివేగం, అజాగ్రత్తగా నడిపి వరికోత యంత్రాన్ని వెనుకనుంచి ఢీకొట్టాడని చెప్పారు. ప్రమాదంలో వరికోత యంత్రం భాగాలు ధ్వంసమయ్యాయని, సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని తెలిపారు. బాధితుడు సదయ్య ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ మేఘ రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

దొంగతనం కేసులో నిందితుడికి జైలుశిక్ష

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ స్టేషన్ పరిధిలోని బాలపల్లి, జాబితాపూర్ గ్రామాల్లో గల కొత్తరాజేశ్వరస్వామి, లలితపరమేశ్వరి ఆలయాల్లో 2024 అక్టోబర్‌లో దొంగతనానికి పాల్పడ్డ తాటిపల్లి గ్రామానికి చెందిన వడ్లూరి నాగరాజుకు అనే నిందితుడికి 4 నెలల 11 రోజులు జైలు శిక్షతో పాటు రూ.400 జరిమానా విధించారు. కోర్టులో కానిస్టేబుల్‌రామకృష్ణ సాక్షులను ప్రవేశపెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజని వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలు రుజువుకావడంతో బుధవారం నిందితుడికి శిక్ష విధిస్తూ జడ్జి శ్రీనిజ కొహిర్కర్ తీర్పు వెలువరించారు.

చెరువులో యువకుడి గల్లంతు

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలోని చింతకుంట చెరువులో బుధవారం పట్టణానికి చెందిన నీలి మల్లికార్జున్(35) అనే యువకుడు గల్లంతయ్యాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం పట్టణానికి చెందిన నీలి భీమక్క అనే వృద్ధురాలు మృతిచెందగా మనవడి వరస అయ్యే మల్లికార్జున్ దినకర్మకు హాజరయ్యాడు. అనంతరం స్నానం చేయడానికి చెరువులోకి దిగాడు. చెరువులోని ఒక ఒడ్డు నుంచి మరో ఒడ్డుకు ఈత కొడుతుండగా మధ్యలోనే మునిగిపోయాడు. రెండు ఒడ్ల మధ్య సుమారు 150మీటర్లకు పైగా దూరం ఉండడంతో ఈదలేక మధ్యలోనే మునిగిపోయాడని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. అయితే బంధువులు అతడిని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. పోలీసులు గజఈతగాళ్ల సహాయంతో చెరువులో గాలింపు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు.

వేర్వేరు ప్రాంతాల్లో వడదెబ్బతో ఇద్దరి మృతి



రమేష్(ఫైల్)

రామడుగు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన కల్లెం రమేష్(55) వడదెబ్బతో మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రమేష్ వివిధ పనుల నిమిత్తం ఎండలో తిరిగాడు. సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. రాత్రివాంతులు,విరేచనాలతో బాధపడుతూ అర్ధరాత్రి మృతిచెందినట్లు తెలిపారు.

ఫైటింక్లయిన్‌కాలనీ: వడదెబ్బతో కాలనీలో పుల్లూరి రమేష్(37) అనే వ్యక్తి బుధవారం మృతి చెందాడు. కాలనీలో ఉంటూ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న రమేష్ మూడు రోజుల పాటు విధులకు వెళ్లి బుధవారం ఇంటికి వచ్చాడు. నీరసంగా ఉన్న రమేష్‌ను కుటుంబ సభ్యులు గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా వడదెబ్బ తగిలిందని వైద్యులు మందులు ఇచ్చారు. ఆసుపత్రి నుంచి ఇంటికి రాగా ఇంటి ముందు రమేష్ కుప్పకూలాడు. బంధువులు గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే రమేష్ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.



అధిక లోడ్‌తో అదనపు బిల్లు

● మీటర్లపై భారం పడకుండా చూస్తే మంచిది

● అవసరానికి అనుగుణంగా మీటర్ తీసుకుంటే మేలు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యుత్ పొదుపు పాటించకుంటే అదనంగా చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. బిల్లు అధికంగా వస్తే అదనంగా డెవలప్‌మెంట్ చార్జీలు చెల్లించాలి. ఈ బిల్లులు అధికంగా వచ్చిన సమయంలో డెవలప్‌మెంట్ చార్జీలు చెల్లించాలని విద్యుత్ అధికారులు నోటీసులు జారీ చేస్తారు. మీటర్‌కు దరఖాస్తు చేసుకున్న సమయంలోనే వినియోగదారుల్లో చాలామంది ఒక కిలోవాట్ సామర్థ్యం చాలంటూ డీడీలు చెల్లిస్తారు. ఆ సమయంలో నాలుగు బల్బులు, రెండు ఫ్యాన్లు, టీవీ ఉన్నట్లు పేర్కొంటారు. తర్వాత ఇంట్లో కూలర్లు, ఏసీలు, ఫ్రిజ్లు, వాషింగ్ మిషన్లు, రైస్ కుక్కర్లు, గీజర్లు అదనంగా వచ్చి చేరుతుంటాయి. దీంతో దరఖాస్తు చేసుకున్న దానికంటే అధికంగా లోడు పెరిగి భారం విద్యుత్ ఫీడర్లపై పడుతుంది. దీంతో విద్యుత్ అధికారులు అధిక భారాన్ని అధిగమించడానికి కొత్త విద్యుత్ స్తంభాలు, విద్యుత్తు లైన్లు వేయాల్సి ఉంటుంది. ఇందుకయ్యే ఖర్చును ఎవరైతే అధిక లోడు విని యోగించుకుంటున్నారో వారిపై వేస్తారు.

● **అవగాహన లేక..:** డెవలప్‌మెంట్ చార్జీల విషయమై చాలా మందికి అవగాహన ఉండదు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తుంటారు. ముందుగా ఇంట్లోకి అదనంగా ఉపకరణాలు తీసుకొస్తే వాటికి విద్యుత్ ఎంత అవసరమో తెలుసుకోవాలి. విద్యుత్ అధికారులతో మాట్లాడి మీటర్ పరిధిని మార్చాలని దరఖాస్తు చేసుకోవాలి. అదనంగా కిలోవాట్‌కు 1,200 రూపాయలు సెక్యూరిటీ డిపాజిట్ కింద 200 రూపాయలను మీసేవలో చెల్లిస్తే మీటర్ పరిధి వారం రోజుల్లో మారుతుంది. దీంతో అధిక చార్జీలు ఉండవు. ఒకేసారి వినియోగించినప్పుడు అధిక లోడ్ నమోదవుతుంది. ఈ సమస్యను నుంచి బయటపడాలంటే మీటర్ల సామర్థ్యం పెంచుకోవడమే ఉత్తమమని విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

మీటర్లపై భారం పడకుండా చూడాలి

మేక రమేశ్‌బాబు, టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ



మీటర్ తీసుకునే ముందు ఎన్ని కిలో వాట్లు అవసరం ఉంటుందో విద్యుత్ అధికారులకు చెబితే బాగుంటుంది. అధిక చార్జీల భారం పడకుండా ఉంటుంది. తక్కువ కిలోవాట్‌కు డిపాజిట్ చెల్లించి ఆ తరువాత వచ్చే అధిక బిల్లులతో ఇబ్బంది పడొద్దు. కార్యలయల చుట్టూ తిరిగినా విద్యుత్ బిల్లులు తగ్గకపోగా అదనపు చార్జీల భారం పడుతుంది. విద్యుత్ వినియోగదారులు అధికారులను సంప్రదించి బిల్లులు చెల్లించి అదనపు లోడ్‌ను రెగ్యులర్ చేయించుకోవాలి.

చట్టంతో ఆడుకున్న చెన్నమనేనిని కఠినంగా శిక్షించాలి

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డిమాండ్

● ఆదిశ్రీనివాస్ వాంగ్మూలం నమోదుచేసిన సీఐడీ పోలీసులు



హైదరాబాదులోని సీఐడీ కార్యాలయం ఆవరణలో విలేకరులతో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భారత పౌరుడు కాకుండానే శాసనసభ్యుడిగా పోటీచేసిన మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు చెన్నమనేని రమేష్‌ను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో భారత పౌరసత్వం పొందారని నిర్ధారిస్తూ చెన్నమనేని రమేష్ పౌరసత్వాన్ని హైకోర్టు రద్దుచేసిన నేపథ్యంలో ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ ఆదిశ్రీనివాస్ సీఐడీ పోలీసులకు ఫిర్యాదుచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం సీఐడీ పోలీసులు ఆది శ్రీనివాస్ వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అనంతరం సీఐడీ కార్యాలయం ఆవరణలో ఆది శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ చెన్నమనేని రమేష్‌బాబు భారతీయుడు కాకుండానే భారతీయుడని చట్టసభల్లో అడుగుపెట్టారని, ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. చట్టంతో ఆడుకున్న వ్యక్తిని కఠినంగా శిక్షించడం ద్వారా భవిష్యత్తులో ఇలాంటి పొరపాటు ఎవరూ చేయకుండా చూడవచ్చన్నారు. ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు రమేష్ బాబు ఏ దేశ పాస్‌పోర్టు మీద భారతదేశానికి వచ్చారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. భారత దేశ పౌరుడైతేనే జడ్పీటీసీగా, ఎంపీటీసీగా, సర్పంచ్‌గా, ఎమ్మెల్యేగా ఎం పీగా పోటీచేయాలని మనదేశ చట్టం చెబుతుందన్నారు. దేశ పౌరుడు కాదని తీర్పువచ్చిన నేపథ్యంలో అధికా రులు విచారణ జరిపి 2009 నుంచి ఎమ్మెల్యేగా ఉన్న కాలాన్ని సరిచేయాలని, ఈ తీర్పుతో న్యాయస్థానాలపై గౌరవం పెరిగిందని, 14 సంవత్సరాల పోరాటంలో తనకు అండగా ఉన్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కొడిమ్యాల, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన దుబ్బాక జమున(26) అనే వివాహిత కొద్ది రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం చేయగా మంగళవారం రాత్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్.సందీప్ తెలిపారు. జమునకు గత సంవత్సరం మార్చిలో కొడిమ్యాలకు చెందిన దుబ్బాక రాహుల్‌తో వివాహం జరిగింది. ఆరు నెలల నుంచి ఆమెభర్త రాహుల్, మామ దుబ్బాక లక్ష్మీనారాయణ అదనపు వరకట్నం కోసం వేధింపులకు గురి చేశారని మృతురాలి తల్లి కొమ్ము పోషవ్వ ఫిర్యాదు చేసింది. భర్త, మామ అదనపు వరకట్నం వేధింపులతో ఈనెల 21న ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నం చేయగా జగిత్యాలలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి పోషవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్యను వేధించిన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్యను వేధించిన సిరిసిల్ల పట్టణం సిద్దులవాడకుచెందిన కర్లబత్తుల ప్రేమ్‌సాగర్ రావుకు ఏడాదిజైలు శిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ బుధవారం సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల టౌన్‌సీఐ కె కృష్ణ తెలిపారు. ఆయన వివరాలప్రకారం... సిరిసిల్ల పట్టణంలోని సిద్దులవాడకు చెందిన కర్లబత్తుల పద్మావతికి మాజీఏఈఈ కర్లబత్తుల ప్రేమ్‌సాగర్‌రావుతో 31సంవత్సరాల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. ఏఈఈగా పనిచేసిన ప్రేమ్‌సాగర్‌రావు సస్పెండ్ కావడంతో తాగుడుకు బానిసై తరచూ భార్య పద్మావతిని డబ్బులు అడగడమే కాకుండా ఇవ్వకుంటే కొడుతుండేవాడు. జనవరి 27, 2017న తన భర్త ప్రేమ్‌సాగర్‌రావు ఇంట్లోకి తాగివచ్చి డబ్బులు ఇవ్వమని కొట్టి మానసికంగా వేధించాడని భార్య పద్మావతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా అప్పటి విచారణ అధికారి లియకత్ అలీ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశాడు. ఈ కేసులో కోర్టు మానిటరింగ్ అధికారి శ్రవణ్‌యాదవ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేశ్ ఆరుగురు సాక్షులను ప్రవేశపెటారు. పీపీసందీప్ వాదించగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ నేరస్థుడైన ప్రేమ్‌సాగర్‌రావుకు ఏడాదిజైలు శిక్షతోపాటు రూ.2వేల జరిమానా విధించారని సీఐ కృష్ణ తెలిపారు.

బోర్ల విద్యుత్ వైర్లు చోరీ

గంగాధర, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం రంగారావుపల్లి, తాడిజెర్రిలో వ్యవసాయ బోర్ల విద్యుత్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిజెర్రి, రంగారావుపల్లి గ్రామాల్లో బోర్ల డబ్బాలకు ఎప్పటిలాగే మంగళవారం తాళంవేసి వెళ్లారు. బుధవారం పొలాలకు వెళ్లిన రైతులకు డబ్బా నుంచి బోరు మోటారుకు వేసిన వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించి ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. తాడిజెర్రిలోని ఐదుగురు రైతులు, రంగారావుపల్లిలో ఒక్కరైతుకు చెందిన 4వందల మీటర్లవైరును ఎత్తుకెళ్లారు. వైరు విలువ 52వేలు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.

నష్టపరిహారం చెల్లించాకే షెడ్డును కూల్చండి

● సబ్‌స్టేషన్ పనులను అడ్డుకున్న బాధితులు



షెడ్డును కూల్చకుండా అడ్డుగా నిల్చున్న బాధితులు

వేములవాడ టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం రుద్రవరం గ్రామానికి మంజూరైన సబ్‌స్టేషన్ స్థలంలోని షెడ్డును సంబంధిత అధికారులు కూల్చేందుకు ప్రయత్నించగా, భూయజమానులు తమకు నష్టపరిహారం అందలేదని, పరిహారం వచ్చిన తర్వాతే షెడ్డును కూల్చాలని పనులను అడ్డుకున్నారు. వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన నాంపల్లి రాజయ్యకు చెందిన 383, 384 సర్వే నంబర్ గల స్థలంలో షెడ్డు ఏర్పాటు చేసుకున్నారు. సదరు షెడ్డుకు ఇప్పటి వరకు నష్టపరిహారం రాలేదని, నష్టపరిహారం చెల్లించిన తరువాతనే షెడ్డును కూల్చాలని భీష్మించుకు కూర్చున్నారు. దీంతో చేసేదేమి లేక సంబంధిత అధికారులు అక్కడి నుంచి తిరిగి వెళ్లిపోయారు. నష్టపరిహారం చెల్లించకుండా తమ షెడ్డును కూల్చివేస్తే తరువాత జరుగు సంఘటనలకు అధికారులు బాధ్యత వహించాలని భూయజమాని ఆవేదన వ్యక్తం చేశారు.

అంతర్రాష్ట్ర దొంగ రిమాండ్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండల పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడిన మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను బుధవారం రిమాండ్‌కు తరలించామని కరీంనగర్ రూరల్ ఏఎస్పీ శుభం ప్రకాశ్ తెలిపారు. ఈ మేరకు విలేకరులకు వివరాలు వెల్లడించారు. గతేడాది జూలైలో కరీంనగర్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని గుంటూరుపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడిన దొంగలు 2.25 లక్షల విలువైన బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. అనంతరం మల్కాపూర్ రోడ్డులోని పీవీఆర్ గార్డెన్స్ సమీపంలో కె.రాజేంద్రప్రసాద్ ఇంటి తాళాలు పగలగొట్టి మద్యం సీసాలతో పాటు హీరో హోండా మోటార్ సైకిల్‌ను దొంగిలించారు. ఈ ఘటనలపై కరీంనగర్ రూరల్, కొత్తపల్లి పోలీసులు కేసు విచారణ చేపట్టారు. దర్యాప్తులో నిందితులు మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లాకు చెందిన ప్రదీప్, విక్రమ్, హత్రు సింగ్, జితేన్‌గా గుర్తించారు. కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ పోలీసుఠాణాలో రెండు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో ప్రధాన నిందితుడైన ప్రదీప్‌ను గత మార్చిలో రిమాండ్‌కు తరలించామని ఏఎస్పీ శుభం ప్రకాశ్ తెలిపారు. ఈ కేసులో మరో నిందితుడైన హత్రుసింగ్ మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లా నరవాలిలో ఉన్నాడని సమాచారం రావడంతో, కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం అక్కడికి వెళ్లిందని, మంగళవారం నిందితుడిని అరెస్టు చేసి కరీంనగర్‌కు తీసుకొచ్చిందని తెలిపారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు విక్రమ్, జితేన్ పరారీలో ఉన్నారని, వారిని పట్టుకోవడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండల శివారులోని వెలిచాల ఎక్స్ రోడ్డు వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తపల్లి మండలం నాగులమల్యాల గ్రామానికిచెందిన మొగిలిపాలెం గంగరాజు(42) మృతి చెందాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. గంగరాజు గంగాధర మండలం సర్వారెడ్డిపల్లిలో పని ముగించుకొని తనబైక్‌పై నాగులమల్యాలకు బయల్దేరాడు. వెలిచాల ఎక్స్‌రోడ్డు వద్ద ఒకలారీ అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో గంగరాజు ఎగిరి రోడ్డుపై పడ్డాడు. తీవ్రగాయాలతో గంగరాజు అక్కడికక్కడే మృతి చెందినట్లు, మృతుడి కొడుకు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అదృశ్యమైన కార్యదర్శి ఆచూకీ తిరుపతిలో లభ్యం..

● 48 గంటల ఉత్కంఠకు తెర

తంగళ్లపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రియాంక తిరుపతిలో దొరికింది. గత రెండు రోజులుగా కార్యదర్శి అదృశ్యంపై రాజన్న సిరిసిల్ల జిల్లాలో కలకాలం ఎట్టకేలకు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఆంధ్రప్రదేశ్ తిరుపతిలో ఉన్నట్టు గుర్తించారు. కార్యదర్శి తండ్రి రాజేష్ బంధువులతో కలిసి పోలీసుల సహకారంతో ప్రియాంక ఉన్న చోటుకు బుధవారం చేరుకున్నారు. కాగా, కార్యదర్శి ప్రియాంకను 'ఆంధ్రజ్యోతి' ఫోన్లో సంప్రదించగా, రాజీనామా చేయడానికి గల కారణాలను వివరించింది. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తనను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని అందుకే రాజీనామా చేసి తిరుపతి వెళ్లినట్లు వివరించారు. నిబంధనల ప్రకారం ఉద్యోగం చేస్తే అవమానాలు ఎదురవుతున్నాయని, ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్న పరిశీలించే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. తల్లిదండ్రులు తనను క్షమించాలని వేడుకుంది. కాగా, ప్రియాంకను తీసుకొని తిరుపతి నుంచి బయలుదేరినట్టు, రాత్రి వరకు చేరుకుంటామని కార్యదర్శి తండ్రి రాజేశం తెలిపారు. 48 గంటలుగా కార్యదర్శి అదృశ్యంతో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది.

తండ్రిపై దాడి కేసులో కుమారుడి అరెస్ట్


ధర్మపురి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలం కొసునూర్‌పల్లె గ్రామంలో తండ్రి వేముల సుకేందర్‌రెడ్డిపై రోకలి బండతో దాడి చేసిన కేసులో కొడుకు వేముల విక్రం రెడ్డిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. మార్చి 20న సుకేందర్ రెడ్డితో ఇంటి వద్ద గొడవ పడి కొడుకు విక్రంరెడ్డి రోకలి బండతో గాయపరచినట్లు ఆయన పేర్కొన్నారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న విక్రంరెడ్డిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ జైలుకు పంపించినట్లు ఆయన తెలిపారు.

కారును ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

శంకరపట్నం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామశివారులో బుధవారం కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖనికి చెందిన ఓ కుటుంబం వరంగల్‌లో వివాహానికి హాజరయ్యేందుకు కారులో వెళ్తున్నారు. వరంగల్‌డిపోకు చెందిన బస్సు నిజామా బాద్‌కు ప్రయాణికులతో వెళ్తోంది. మార్గ మధ్యలో కొత్తగట్టు శివారులో కారును బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారుముందు భాగం దెబ్బతింది. విషయం తెలుసుకున్న బ్లూకోల్ట్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కాగా ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

కంకర పోశారు.. తారు వేయడం మరిచారు

మానకొండూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవంపల్లి-కొండపల్కల రోడ్డు నిర్మాణానికి కంకర పోసి నెలలు గడుస్తున్నా ఇంతవరకు తారు వేయలేదు. దీంతో రెండు గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై పోసిన కంకరతో ద్విచక్రవాహనాలు అదుపుతప్పి పడిపోతున్నాయి. ఈ రోడ్డుపైన ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. మండలంలోని లలితాపూర్ నుంచి దేవంపల్లి వరకు తారు రోడ్డు పూర్తిగా చెడిపోయింది. దీంతో లలితాపూర్ నుంచి దేవంపల్లి మీదుగా కొండపల్కల వరకు ఏడు కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి రూ.2,47,70,000 రూపాయలు మంజూరు అయ్యాయి. ఈ రోడ్డు నిర్మాణం పూర్తైతే కొండపల్కల గ్రామస్థులు దేవంపల్లి, అన్నారం మీదుగా కరీంనగర్ ప్రయాణం సులభమవుతుంది. రోడ్డు నిర్మాణం త్వరగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కంకరతో కూడిన దేవంపల్లి-కొండపల్కల రోడ్డు

సిరిసిల్లలో వర్షం

● కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంతోపాటు విలీన గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పలుప్రాంతంలో చెట్లు విరిగిపోయాయి. అలాగే విలీన గ్రామాలైన పెద్దూర్, పెద్దబోనాల, చిన్నబోనాల, చంద్రంపేట, రగుడు గ్రామాలల్లో ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వర్షానికి తడిసిపోవడంతో రైతులు ఇబ్బం దులకు గురయ్యారు. కుప్పలపై టార్పాలిన్ కవరు కప్పినా కూడా ధాన్యం తడిసిపోయింది.



పెద్దూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలపై ఉన్న నీటిని తీసేస్తున్న రైతులు

ఏసీబీ వలలో ఇద్దరు ఎస్సారెస్పీ అధికారులు

● బిల్స్ మంజూరు కోసం సహోద్యోగి వద్ద లంచం డిమాండ్



ఏసీబీకి పట్టుబడిన అధికారులు



బాధితుడు ఇజాజ్

సుల్తానాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సహ ఉద్యోగి మెడికల్ లీవ్ బిల్స్ మంజూరు కోసం 20 వేల రూపాయలు లంచం డిమాండ్ చేసిన ఇద్దరు ఎస్సారెస్పీ ఉద్యోగులు బుధవారం ఏబీసీకి చిక్కారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ శ్రీరాంసాగర్ ప్రాజెక్టు డివిజన్ నంబర్ 6 కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఇజాజ్ ఉల్‌హక్ మూడు నెలలు మెడికల్ లీవ్‌లో ఉన్నాడు. అనంతరం విధుల్లో చేరిన ఇజాజ్ ఉల్‌హక్ లీవ్‌కు సంబంధించిన బిల్లుల మంజూరుకు దరఖాస్తు పెట్టుకున్నాడు. 88రోజుల మెడికల్ లీవ్స్‌కు సంబంధించి 2.40లక్షల రూపాయల బిల్స్ ఆయనకు రావాల్సి ఉంది.

బిల్స్ రికార్డు చేయడానికి సుల్తానాబాద్‌లోని ఎస్సారెస్పీ ఆఫీస్‌లో పనిచేస్తున్న సూపరింటెండెంట్ డి శ్రీధర్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ సురేష్ 20వేల రూపాయల లంచం డిమాండ్ చేశారు. దీంతో ఇజాజ్ ఉల్‌హక్ ఈ నెల 19న కరీంనగర్‌లోని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనమేరకు బుధవారం సుల్తానాబాద్‌లోని ఎస్సారెస్పీ ఆఫీసులో సూపరింటెండెంట్ శ్రీధర్ బాబు, సీనియర్ అసిస్టెంట్ సురేష్‌కు 20వేల రూపాయల లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో దాడిచేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని శ్రీధర్‌బాబు, సురేష్‌ను ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో డీఎస్పీ రమణమూర్తి, సీఐలు కృష్ణ, పున్నం చందర్, సిబ్బంది పాల్గొన్నారు.

భగవద్గీతకు యునెస్కో గుర్తింపు

హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా వాసులు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా హిందూ మత పవిత్ర గ్రంథమైన భగవద్గీతకు యునెస్కో గుర్తింపు లభించింది. భగవద్గీతతోపాటు భరత ముని రాసిన నాట్య శాస్త్రానికి కూడా గుర్తింపు దక్కింది. యునెస్కో తన మెమరి ఆఫ్ వరల్డ్ రికార్డులో ఈ రెండింటికి చోటు కల్పించింది. ఈ విషయంపై జిల్లా వాసులు, గీతాపారాయణపరులు, వివిధ ఆధ్యాత్మిక, భజన, భక్తి, భజన సంగీత విభాగాలకు చెందినవారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గీతా జయంతికి కార్యక్రమాలు కూడా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఆనంద జీవన ప్రయాణానికి గీత అవసరం

అక్షయచైతన్య, కరీంనగర్ చిన్మయమిషన్ ఆచార్యుడు



సవాళ్లు, సమస్యలకు పరిష్కారం చూపి ఆనంద జీవన ప్రయాణం చేసేందుకు ఉన్నత సూత్రాలను, నైతిక విలువలను అందించే జ్ఞాన సంపద భగవద్గీత. యునెస్కో గుర్తింపుతో గీత ప్రపంచానికి మార్గనిర్దేశనం చేస్తుందని బుజువైంది.

గర్వకారణం : బండ సత్తయ్య, గీతా భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు



భగవద్గీతకు యునెస్కో గుర్తింపు రావడం గర్వకారణం. గీతను మరిస్తే మనల్ని మనమే మరచినట్లు. గీతా భక్త సమాజం ద్వారా 14 వేల పుస్తకాలు ముద్రించాము. 10 వేల వరకు ఉచితంగా పంపిణీ చేశాం.

భగవద్గీత సారాంశాన్ని అర్థం చేసుకోవాలి

విష్ణుసేవానందగిరి స్వామి, మళయాళ సద్గురు గీతామందిర సన్యాస మఠం



భగవద్గీత మానవుల నుదుటి గీతగా చెబుతారు. భగవద్గీతలోని సూక్తులను, సారాంశాన్ని అందరూ అర్థం చేసుకొని ఆచరణలో పెడితే జీవితాలు సుగమం అవుతతాయి. గీతను నిత్య పారాయణం చేయాలి. దీంతో మానసిక, శారీరక, లౌకిక ప్రశాంతత చేకూరుతుంది.

విస్తర్లే వారి జీవనాధారం

విస్తరాకులు కుడుతూ ఉపాధి పొందుతున్న రామోజిపేట మహిళలు



విస్తరాకులు కుడుతున్న మహిళలు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట మండల కేంద్రానికి దూరంగా చుట్టూ గుట్టల మధ్య ఉండే రామోజిపేట గ్రామానికి ఓ ప్రత్యేకత ఉంది. గ్రామానికి చెందిన దాదాపు 50 మంది మహిళలు 30 సంవత్సరాలుగా మోదుగ ఆకులతో విస్తర్లు కుడుతూ ఉపాధి పొందుతున్నారు. పేపర్‌ప్లేట్లు మార్కెట్‌లోకి రావడం వల్ల విస్తరాకులు ఆదరణ కోల్పోయినా ఇటీవల పరిణామాలతో మళ్లీ ప్రజలు విస్తరాకుల వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో గ్రామసమీపంలోని గోకరిగుట్ట, ఎల్లోనిబోరు, ఏపగుట్టలకు ఉదయమే వెళ్లి మోదుగ ఆకులు తెచ్చుకునేవారు. ప్రస్తుతం మోదుగు చెట్లు తగ్గడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి ఆకులు తెచ్చుకుంటున్నారు. తెచ్చిన ఆకులను ఎండబెట్టి కొద్ది రోజుల తర్వాత విస్తరాకులు కుడుతారు. ప్రతి ఇంటి ఎదుట మోదుగ ఆకుల కట్టలు కనిపిస్తుంటాయి. 80 విస్తర్లు కట్టగా కట్టి అమ్ముతుంటారు. కట్టకు 130 రూపాయల వరకు అమ్ముతున్నారు. ఇక్కడి నుంచి సిరిసిల్ల, వేములవాడ, ధర్మపురి, కొండగట్టు తదితర ప్రాంతాలకు తీసుకవెళ్లి అమ్ముతుంటారు. గ్రామానికి సైతం ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసి తీసుకొని వెళుతుంటారు.



ఇళ్ల ఎదుట ఆరబెట్టిన మోదుగ ఆకు

విస్తరాకులతో ఉపాధి పొందుతున్నాం..

ఈదుల్ల పుష్ప, గృహిణి రామోజిపేట



గ్రామంలోని మహిళలు మధ్యాహ్నం సమయంలో విస్తరాకులు కుడుతూ ఉపాధిపొందుతున్నాం. మోదుగ ఆకులు దొరకక ఇబ్బంది పడుతున్నాం. అటవీ ప్రాంతానికి వెళ్లినప్పుడు కొన్ని సార్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం విస్తారాకులు కుట్టడాన్ని కుటీర పరిశ్రమగా గుర్తించి రుణసహాయం అందించాలి.

మోదుగు ఆకులు దొరకడం లేదు..

బెజ్జంకి జయ, గృహిణి రామోజిపేట





విస్తరాకులు కుట్టడం వల్ల కొన్ని డబ్బులు వస్తున్నాయి. పుణ్యక్షేత్రాల వద్ద అమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. కుట్టిన విస్తర్లు అమ్మడానికి ఇబ్బంది అవుతుంది. రవాణా చార్జీలు ఎక్కువ అవుతున్నాయి. ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి. బీడుభూములను సాగుచేస్తుండటం వల్ల మోదుగ ఆకులు దొరకడం కష్టంగా మారింది.

కాంగ్రెస్ పాలనలో తిరోగమనంలో రాష్ట్రం

- ఏ ఎన్నిక జరిగినా ఎగిరేది గులాబీ జెండాయే
- శాసన మండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

పెద్దపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం తిరోగమనంలో పయనిస్తున్నదని, రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా ఎగిరేది గులాబీ జెండాయేనని శాసన మండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. సింగరేణి బొగ్గు గనులను ప్రైవేట్ పరం కాకుండా కేసీఆర్ కాపాడితే, వాటిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్రం వద్ద తాకట్టు పెట్టారని ఆరోపించారు. బుధవారం పెద్ద పల్లిలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఒక ప్రాంతీయ పార్టీని 25 ఏళ్లు నడపడం ఆషామాషీ కాదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పుట్టుకు వచ్చిన 160 నుంచి 170 ప్రాంతీయ పార్టీలు నిలవలేకపోయాయని, ఒక్క టీడీపీ, బీఆర్ఎస్ మాత్రమే తట్టుకుని నిలబడ్డాయన్నారు. గులాబీ కండువా కనబడితే కొట్టుకోని గుండే లేదన్నారు. దేశానికే ఆదర్శంగా కేసీఆర్ తీసుక వచ్చిన రైతు బంధు పథకాన్ని కాంగ్రెస్ పార్టీ నీరుగార్చిందన్నారు.

రైతులకు భరోసా లేకుండా చేసిందన్నారు. నార్లు పోస్తే నీళ్లు వచ్చే పరిస్థితి లేదని, పండిన పంటను కొనే దిక్కులేదని అన్నారు. గ్రూపు-1 నియామకాల్లో అంతటా అవినీతి జరిగిందని, అనేక మంది నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. కేసీఆర్ కిట్‌ను అమలు చేయక, ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రసవాల కోసం మహిళలు రావడం లేదని, మళ్లీ ప్రైవేట్ ఆసుపత్రుల బాట పడుతున్నారని మండిపడ్డారు. లాభాల వాటా ఇచ్చే విషయంలోనూ కాంగ్రెస్ సింగరేణి కార్మికులను మోసం చేసిందన్నారు. వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, పుట్ట మధూకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మన్‌రావు, టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ చిరుమళ్ల రాకేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, పార్టీ నాయకులు గంటా రాములు యాదవ్, దాసరి ఉష, పెంట రాజేష్, ఉప్పు రాజు కుమార్, బండారి శ్రీనివాస్‌గౌడ్, మర్కు లక్ష్మన్, పసుల చరణ్, బాలాజీరావు, బొడ్డు రవీందర్, నారాయణదాసు మారుతి పాల్గొన్నారు.

జేఎన్టీయూలో కొనసాగుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల సమ్మె

కొడిమ్యాల, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం నాచుపల్లి జేఎన్టీయూలో కాంట్రాక్ట్ అధ్యాపకులు చేస్తున్న సమ్మె బుధవారం ఐదో రోజుకు చేరుకుంది. కాంట్రాక్ట్ అధ్యాపకులు బైక్‌లపై ర్యాలీగా వెళ్లి కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనం చేసుకొని తమ సమస్యలను పరిష్కరించాలని స్వామి వారికి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమను రెగ్యుల రైజేషన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాప కులు డాక్టర్ రాజేష్, శ్రీనివాసారావు, యామిని, సుజాత, మధుకర్, రాజు పాల్గొన్నారు.



కొండగట్టు అంజన్న ఆలయ ఆవరణలో కాంట్రాక్ట్ అధ్యాపకులు

పీసీసీ అబ్జర్వర్లుగా సత్యనారాయణ, శ్రీనివాస్ నియామకం

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణానికి చెందిన గ్రంథాలయం జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణను కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా అబ్జర్వర్‌గా, టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్‌ను పెద్దపెల్లి కాంగ్రెస్ పార్టీ జిల్లా అబ్జర్వర్‌గా నియమిస్తూ బుధవారం ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి ఇచ్చిన బాధ్యతలను స్వీకరిస్తున్నామన్నారు. జిల్లాలో పార్టీ శ్రేణులను కలుపుకొని పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు.



నాగుల సత్యనారాయణ



సంగీతం శ్రీనివాస్

బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా సమ్మయ్య



భగత్‌నగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా పిట్టల సమ్మయ్య ఎన్నికయ్యారు. రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్‌లో యూనియన్ రాష్ట్ర నాలుగో మహాసభలు మూడు రోజులు కొనసాగాయి. ఇందులో కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలానికి చెందిన పిట్టల సమ్మయ్య రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లా నుంచి రాష్ట్ర కమిటీలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా గందె కొమురయ్య, రేగుల కుమార్ ఎన్నికయ్యారు. వారి ఎన్నికపై యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, అనిశెట్టి చంద్రయ్య, కన్నం సదానందం, కార్యదర్శి ఖాన్ పాష, లక్ష్మణ్, బాదుల్లా నాయకులు జగన్, రమేష్ హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌ను

అడుగడుగునా అవమానించింది..

బీజేపీ దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కాంగ్రెస్ పార్టీ అడుగడుగునా అవమానించందని, అంబేద్కర్ ఆశయ సాధనతో ముందుకు సాగాలని భారతీయ జనతాపార్టీ దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ కోరారు. భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బుధవారం జిల్లా సదస్సును జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపీ అధ్యక్షతన జరిగింది.

ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవమానించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందన్నారు. అంబేద్కర్ చనిపోతే ఆయన అంత్యక్రియలు ఢిల్లీలో జరగనివ్వకుండా ముంబైకి ఆయన పార్థివదేహాన్ని తర లించిందన్నారు. పార్థివదేహం తరలింపునకు అయ్యే విమాన చార్జీలు, బిల్లులు చెల్లించాలని అంబేద్కర్ సతీమణికి నోటీసులు పంపించిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందన్నారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ, పండింత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆలోచనా విధానాన్ని బలపరిచి అంబేద్కర్‌కు ఆయన ఆలోచనలకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం తగిన గౌరవం ఇస్తోందన్నా రు. భావితరాలకు అంబేద్కర్ చరిత్ర తెలిసేలా పంచ తీర్థాలను ఏర్పాటు చేయడంతో పాటు దళితుడైన రామ్‌నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతిగా చేసిందన్నారు. అణగారిన వర్గాల్లో వెలుగులు నింపిన అంబేద్కర్‌కు భారతరతన్న కోసం బీజేపీ కృషి చేసిందన్నారు.

ఈ సదస్సులో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జెనవాడే సంగప్ప, దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి కుమ్మరి శంకర్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎర్ర మహేష్, అల్లాడి రమేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మ్యాన రాంప్రసాద్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొక్కు దేవేందర్ యాదవ్, జిల్లా కార్యదర్శి రేగుల దేవేం దర్, కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీ నర్ అడెపు రవీందర్, అసెంబ్లీ నియోజకవర్గాల కన్వీనర్‌లు కారెడ్ల మల్లారెడ్డి, మరుతు సత్తయ్య, జిల్లా అధికార ప్రతి నిధి బర్కం నవీన్ యాదవ్, సంతోష్ రెడ్డి, అంబేద్కర్ జయంతి ఉత్సవాల కన్వీనర్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు చంటి మహేష్, కో-కన్వీనర్ కొంపెల్లి రాజేందర్, యాదగిరి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.



సిరిసిల్లలో బీజేపీ సదస్సులో మాట్లాడుతున్న ఎస్ కుమార్

పగిలిన ఎన్టీపీసీ యాష్‌పాండ్ పైపులైన్



ఇళ్లలోకి చేరిన బూడిద నీరు

అంతర్గాం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి ఏరియాలో గల అక్బర్‌నగర్ కాలనీలో బుధవారం ఎన్టీపీసీ యాష్ పాండ్‌కు వెళ్లే పైపులైన్ పగలడంతో సమీపంలోని ఇళ్లలోకి బూడిద నీరు చేరి కాలనీమొత్తం జలమయమైంది. ఎన్టీపీసీ నుంచి కుందనపల్లి యాష్ పాండ్ వెళ్లే పైపులైన్ ఇళ్లను ఆనుకొని ఉండడంతో పైపులైన్ పగలగా బూడిద నీరు లీకేజీ గంట పాటు కొనసాగింది. భయాందోళనతో కాలనీవాసులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న ఎన్టీపీసీ అధికారులు పైపులైన్‌కు బూడిద నీటి సరఫరా నిలిపివేయడంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. అప్పటికే సమీపంలోని ఇళ్లతో పాటు వందమీటర్ల మేరకు రహదారిపై బూడిద చేరడంతో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎన్టీపీసీ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని అక్బర్‌నగర్ కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లలోకి మొత్తం బూడిద నీరు చేరడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీని స్థానిక రామగుండం ఎస్ఐ సంధ్యారాణి, కాంగ్రెస్ నాయకుడు ఎండీ ఆసిఫ్ సందర్శించారు. ఎన్టీపీసీ అధికారులు అటువైపు రాకపోవడంతో కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాజన్న హుండీ ఆదాయం

రూ. 2.01 కోట్లు

184 గ్రాముల బంగారం, 12 కిలోల 300 గ్రాముల వెండి



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామివారి ఆలయ ఖజానాకు రూ. 2 కోట్ల ఒక లక్ష 53 వేల 852 నగదు సమకూరినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి వెల్లడించారు. రాజన్న ఆలయ ఆవరణలోని ఓపెన్‌స్లాబ్‌లో గత 29 రోజుల హుండీలను అత్యంత భద్రత మధ్య బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయానికి రూ. 2 కోట్ల ఒక లక్ష 53 వేల 852 నగదు ఆదాయం రాగా 184 గ్రాముల మిశ్రమ బంగారం, 12 కిలోల 300 గ్రాముల వెండి సమకూరినట్లు తెలిపారు. హుండీల లెక్కింపును ఆలయ ఈవో వినోద్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ సహాయ కమిషనర్ కార్యలయ డివిజనల్ ఇన్ స్పెక్టర్ ఎస్పీఎఫ్ సిబ్బంది, శివరామకృష్ణ భజన మండలి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

వసతిగృహాల నిర్మాణానికి మోక్షమెప్పుడో..?

- కొండగట్టు పర్యటనలో ఏపీ డిప్యూటీ సీఎంకు అధికారుల వినతి
- అంజన్న ఘాట్ రోడ్డు సమీపంలో టీటీడీ ఇంజనీరింగ్ అధికారుల స్థల పరిశీలన
- పనులు ప్రారంభించకపోవడంతో భక్తుల ఇక్కట్లు





ప్రతిపాదిత వంద గదుల నిర్మాణ ప్రాంతం

మల్యాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం పరిధిలో ప్రతిపాదిత తిరుమల తిరుపతి దేవస్థానాల వంద గదుల నిర్మాణం ఊసే లేదు.

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గతేడాది జూన్ 29న కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చిన ఏపీ డిప్యూటి సీఎం పవన్‌కళ్యాణ్‌కు తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా వంద గదుల సత్రం నిర్మాణంతో పాటు రెండు వేల మంది కూర్చునే దీక్ష విరమణ మండపం ఏర్పాటుకు కృషి చేయాలని దేవస్థానం అధికారులు, అర్చకులు వినతిపత్రం అందజేశారు. దీనికి పవన్ సానుకూలంగా స్పందించగా పలుమార్లు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో పాటు దేవస్థానం అధికారులు పవన్‌కళ్యాన్ దృష్టికి తీసుకెళ్లారు.

ఇందులో భాగంగానే గదులతో పాటు దీక్షావిరమణ మండపం నిర్మాణంకుగాను గత అక్టోబరులో తెలంగాణలో టీటీడీ ఇంజనీరింగ్ వ్యవహారాలు పర్యవేక్షించే టీటీడీ డీఈ పీవీ.నాగరాజు, ఏఈ జే.నాగరాజు కొండగట్టుకు వచ్చారు. స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి వంద గదులు, దీక్షావిరమణ మండప నిర్మాణంకు ఘాట్‌రోడ్డు పక్కన, జేఎన్‌టీయూ కళాశాల సమీపంలో దేవస్థానం భూములను పరిశీలించారు. టీటీడీ అధికారుల పరిశీలన జరిగిన పక్షం రోజుల్లోనే దేవస్థానానికి చెందిన సర్వే నం.362/1లో గదుల నిర్మాణంకు అవసరమైన స్థలం కేటాయిస్తూ టీటీడీకి కొండగట్టు దేవస్థానం తరపున లేఖ కూడా రాశారు. పనులను త్వరితగతిన ప్రారంభించాలని అందులో కోరారు. అయితే కొన్నాళ్లుగా గదుల నిర్మాణం ఊసే లేకుండా పోయింది. ఏపీ డిప్యూటి సీఎం చొరవతో కొండగట్టులో వంద గదుల నిర్మాణంకు అనుమతులు లభిస్తాయని భక్తులు, ఈ ప్రాంత వాసులు ఆశించారు. అయితే పవన్ కళ్యాణ్ వచ్చి ఏడాది సమీపిస్తున్నప్పటికీ టీటీడీ గదుల నిర్మాణం ప్రతిపాదనలు ముందుకు వెళ్లకపోవడంతో భక్తులు నిరాశ చెందుతున్నారు. టీటీడీ పాలక మండలి సమావేశంలో కొండగట్టు గదుల నిర్మాణాన్ని చర్చించేలా ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రత్యేక చొరవ చూపాలని పలువురు భక్తులు కోరుతున్నారు.



టీటీడీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యం(ఫైల్)

పారిశుధ్య సిబ్బందికి శానిటేషన్ పరికరాలు పంపిణీ

ధర్మపురి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య సిబ్బంది సక్రమంగా శానిటేషన్ పరికరాలు ఉపయోగించుకోవాలని ధర్మపురి మున్సిపల్ కమీషనర్ కల్లెడ రాజశేఖర్ కోరారు. ధర్మపురి మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి బుధవారం ఆయన చేతుల మీదుగా సానిటేషన్ పరికరాలు అందించారు. ఈసందర్భంగా ఆయన పారిశుధ్య సిబ్బందికి అవసరం అయ్యే పీపీ కిట్స్, తట్టలు, పారలు, చీపుర్లు, గ్లౌజులు అందించి వీధులను శుభ్రం చేసి ఉంచాలని అన్నారు. అలాగే మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుక వచ్చి పరిష్కరించుకోవాలని ఆయన తెలిపారు. ఆయన వెంట ధర్మపురి మున్సిపల్ మేనేజర్ బాలె గంగాధర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్యాల గంగాధర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరు మహేష్, సానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూషణరావుపేట యువకుడు ఏఈగా ఎంపిక

కథలాపూర్, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూషణ రావుపేటకు చెందిన ఊశకోల అనిల్ అనే యువకుడు ఆర్అండ్‌బీ శాఖలో ఏఈగా ఎంపిక య్యాడు. ఇటీవల విడుదలైన టీజీపీఎస్సీ పరీక్షా ఫలితాల్లో మంచి ర్యాంకు సాధించిన అనిల్ ఏఈగా ఎంపిక కాగా బుధవారం రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలో ఉద్యోగంలో చేరాడు. గతంలో వార్డ్ ఆఫీసర్, జీహెచ్ఎంసీలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన అనిల్‌ను పలువురు అభినందించారు.

అంతర్గాం పాఠశాల వార్షికోత్సవం

జగిత్యాలరూరల్, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఘనంగా వార్షికోత్సవం నిర్వహించారు. వేడుకలకు ఎమ్మెల్యే సంజయ్, మాజీ మంత్రులు దేవయ్య, రాజేశంగౌడ్ హాజరయ్యారు.

విద్యార్థులను అభినందించిన కలెక్టర్

మల్యాల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల కళాశాల విద్యార్థులు ఇంటర్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించడంతో బుధవారం కలెక్టర్ సత్యప్రసాద్ అభినందించారు. కళాశాల అధ్యాపకుల పని తీరును మెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మానస, అధ్యాపకులు ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

ఆలయ చైర్మన్‌గా రాజ్‌కుమార్

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): ఎర్దండి గంగమాత దేవాలయం ఛైర్మన్‌గా రాజ్‌కుమార్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. అదే విధముగా కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఛైర్మను రాజును కమిటీ సభ్యులను నాయకులు ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ బొరిగాం రాజు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్, మాజీ ఎంపీపీ దేవేందర్ పాల్గొన్నారు.

ఉగ్రదాడి మృతులకు ఘన నివాళి


జగిత్యాల జిల్లా కేంద్రంలో కొవ్వొత్తులతో కాంగ్రెస్ నాయకుల నివాళి



మెట్‌పల్లిలో కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో గల బైసరన్ లోయలో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారికి బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నివాళులర్పించారు. పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రివర్యులు తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. ఉగ్రదాడి ఘటనలో మృతిచెందిన మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జగిత్యాలలో కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం అందించడంతో పాటు, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించి అండగా నిలవాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు స్థానిక ఇందిరా భవన్ నుంచి తహశీల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.

●జమ్మూకాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు రూ. కోటి పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

●ఉగ్రదాడిని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ దావ వసంత ఖండించారు.

●పట్టణంలోని స్థానిక టవర్‌సర్కిల్ వద్ద ఉగ్రవాదుల దిష్టిబొమ్మను విశ్వహిందూపరిషత్ బాధ్యులు దహనం చేసి మృతులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘ నగర అధ్యక్షుడు జిట్టవేణి అరుణ్‌కుమార్, నాయకులు బోయిని పద్మాకర్, గాజోజు సంతోష్, రాములు, పరంధామ్, భజరంగ్ దళ్ టౌన్ కన్వీనర్ మహేందర్ పాల్గొన్నారు.

●బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్ ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక తహశీల్ చౌరస్తా వద్ద ఉగ్రదాడి మృతులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆముదరాజు, జుంబర్తి దివాకర్, జున్ను రాజేందర్, సిరికొండ రాజన్న, బందెల గంగారాజం పాల్గొన్నారు.

●పట్టణంలోని స్థానిక జ్యోతి హై స్కూల్ ఐఐటీ అకాడమీలో ఉగ్రదాడి మృతులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బియాల హరిచరణ్‌రావు పాల్గొన్నారు.

●ఉగ్రదాడిని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కందుకూరి రవి బాబు, మామిడి రమేష్‌లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వారు విజ్ఞప్తి చేశారు.

●**కోరుట్ల:** ఉగ్రదాడి దురదృష్టకరమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. బుధవారం పట్టణంలోని జువ్వాడి భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జువ్వాడి కృష్ణారావు మాట్లాడారు.

●ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన అమరులకు బీజేపీ, బీజేవైఎం శ్రేణులు ఘన నివాళిని అర్పించారు. పట్టణంలోని కార్గిల్ చౌర్తాసాలో నాయకులు కోవ్వతుల నివాళిని అర్పించి ప్రగాడ సంతాపంను ప్రకటించారు. నివాళ్ళి అర్పిస్తున్న సమయంలో ఓ చిన్నారి మాక్ పాక్ ఆక్రమిత కాశ్మీర్ వద్దు మోడీ జీ, అమిత్ భాయ్ జీ డైరెక్ట్ ప్రాకిస్తాన్ కావాలని ప్లకార్డును ప్రదర్శించడం అకటుకుంది.

●**మెట్‌పల్లి టౌన్:** పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో నాయకులు కోవ్వతుల నివాళిని అర్పించి ప్రగాడ సంతాపంను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

●**మెట్‌పల్లి రూరల్:** మండలంలోని జగ్గసాగర్‌లో బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్, వేంపేటలో నలిమెల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో వంగల సాగర్, గాజంగి రామస్వామి, గడ్డం సాయిరెడ్డి, దొంగిసారం పాల్గొన్నారు.

●**ధర్మపురి:** ధర్మపురి పట్టణంలో హిందు ఐక్య వేదిక నిర్వాహకులు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ బుధవారం నిర్వహించారు. స్థానిక నంది విగ్రహం నుంచి గాంధీచౌక్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో హిందువులు, అన్ని పార్టీల నాయకులు, యువకులు పాల్గొని కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. అనంతరం ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు.

●**కొడిమ్యాల:** మండల కేంద్రంలోని అంగడి బజారులో నిర్వహించిన కార్యక్రమంలో నాంపెల్లి రాజేశం, ఎర్రోజు శ్రీధర్, మచ్చ రాజు, చెన్న దేవేందర్, ఏనుగు ఆదిరెడ్డి, గజ్జల కరుణాచారి ఉన్నారు.

●**రాయికల్:** రాయికల్ పట్టణంలో ఉగ్రదాడి మృతులకు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. బస్టాండ్ నుంచి గాంధీ విగ్రహం వరకు భరతమాతకు జై అంటూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవ హారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

●**మల్యాల:** ఉగ్రదాడి మృతులకు మల్యాల, రామన్నపేటలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయిల్నేని సాగర్‌రావు, బింగి వేణు, గాజుల మల్లేశం, కొల్లూరి గంగాధర్, బొడిగే సురేశ్, అజర్, సామ మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

మల్యాల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని తక్కళ్లపల్లి సింగిల్‌విండో ఆధ్వర్యంలో కొంపల్లిలో నూతనంగా మంజూరైన ధాన్యం కొనుగోలు కేంద్రంను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. కొంపల్లె రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రం కోసం ఎమ్మెల్యేను కోరగా అడిషనల్ కలెక్టర్ కొనుగోలు కేంద్రం మంజూరి చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఎమ్మెల్యే సత్యంతో పాటు ఛైర్మన్ చంద్రశేఖర్ తదితరులు ప్రారంభిం చడంతో రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునీందర్, విండో సీఈవో మనోజ్, నాయకులు దొంగ ఆనందరెడ్డి బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ముత్యం శంకర్, మ్యాక లక్ష్మన్, నరసింహారెడ్డి, లక్ష్మణాచారి, గుర్రం వెంకన్న, హరినాథ్, రవీంధర్‌రెడ్డి, కరుణాకర్ పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద బాధితులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం మోరపల్లి గ్రామానికి చెందిన అబ్బల్‌బీ ఇల్లు ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్ వల్ల దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ బాధితులకు వారి ఇంటి వద్ద తక్షణ సాయం కింద రూ.95వేలు ప్రొసీ డింగ్ కాపీని అందజేశారు. ఈసంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు రాజేందర్, సదానందం, వేణుగోపాల్, తిరుపతిరావు, చంద్రశేఖర్ కొమురయ్య, గంగేష్, తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందేదెన్నడో..?

(5వ పేజీ తరువాయి)

చేరినా నష్టం జరిగిన సందర్భాల్లో వివిధ నిబంధనలను సాకుగా చూపి ఇన్సూరెన్స్ కంపెనీలు పరిహారం ఇచ్చేందుకు ఆసక్తి కనబరచలేదని రైతులు అంటున్నారు. క్షేత్రస్థాయిలో పంట నష్టం జరిగితే వాతావరణ కేంద్రం నుంచి సరియైన సమాచారం వెళ్లకపోవడంతో ఇన్సూరెన్స్ కంపెనీలు పరిహారం ఇచ్చేందుకు నిరాకరించాయి. దీంతో ఈ పథకాన్ని గత ప్రభుత్వం రద్దు చేసింది.

● పరిహారానికి ని'బంధనాలు'..

జిల్లాలో ఈదురు గాలులు, వడగళ్ల వర్షంతో చేతికొచ్చిన పంటకు నష్టం వాటిల్లింది. నిబంధనల ప్రకారం 33 శాతం నష్టం జరిగితేనే పరిగణనలోకి తీసుకోవాలనే ఉత్తర్వులు జారీ రావడంతో అధికారులు సర్వే నిర్వహించారు. చాలా చోట్ల కోతదశలో ఉన్న పంటలను జాబితాలోకి ఎక్కించ లేదు. నష్టం లెక్కలోకి తీసుకోవాలని రైతులు విన్నవించినా అధికారులు పట్టించుకోలేదు. నిర్ణీత శాతం లోపు జరిగిన నష్టాన్ని అధికారులు పట్టించుకోవడం లేదు.

●పరామర్శలకే పరిమితమైన ప్రజాప్రతినిధులు

జిల్లాలో ఈదురు గాలులు, అకాల వర్షం వల్ల జరిగిన నష్టాన్ని పరిశీలించడానికి ఇటీవల పలువురు ప్రజా ప్రతినిధులు విస్తృతంగా పల్లెల్లో పర్యటించి రైతులకు భరో సా అందించారు. కొద్ది రోజుల క్రితం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఇబ్రహీంపట్నం మండలం కోజన్ కొత్తూర్‌లో పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించారు. ఇటీ వల కలెక్టర్ సత్యప్రసాద్ సైతం మెట్‌పల్లి, కోరుట్ల రెవెన్యూ డివిజన్లలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీ లించారు. ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల్లో ఎమ్మె ల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మెట్‌పల్లి మండలంలో ఏఎంసీ ఛైర్మన్ కూనగోవర్ధన్‌లు పర్యటించి పరిశీలన జరి పారు. అయితే పరిశీలనలు, పరామర్శలతో పాటు పంటకు నష్ట పరిహారం అందించేలా ప్రజాప్రతినిధులు, అధికా రులు కృషి చేయాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

ఇంటర్ ఫలితాల్లో అల్ఫోర్స్ విజయం చరిత్రాత్మకం

-అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియేట్-2025 ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో చూపిన ప్రతిభ, సాధించిన ప్రగతి చరిత్రాత్మకం అని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పురాణిపేటలో గల అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిరంతర కృషితో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం, జగిత్యాల జిల్లాలో ప్రథమస్థానం మార్కులు సాధించి విద్యాసంస్థను అగ్రస్థానంలో నిలపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇబ్రహీంపట్నం, కేశవాపూర్, ఎర్రపూర్, గోధుర్, కోమటి కొండాపూర్‌లో ఇటీవల కురిసిన అకాల వర్షంకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి మానుక ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో మల్లాపూర్ మండల టిడిపి అధ్యక్షులు ఎండి సాదుల్లా, నియోజకవర్గ టిడిపి సభ్యులు రాజ గణేష్ ,కోరుట్ల పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు మహదేవ్, ఇర్నాల గంగులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

బుగ్గారం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని మండల బీజేపీ అధ్యక్షుడు మేడ వేణి శ్రీధర్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో బిజెపి పార్టీ కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్వచ్ఛ భరత్ కన్వీనర్ మంచి రాజేష్, మండల ఉపాధ్యక్షులు బండారి సత్తన్న పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

జగిత్యాలరూరల్, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థులు మంగళవారం వెలువడిన ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. ఎంపీసీలో భోదాసు నాగరాణి 457బై470, ఏనుగుల దీక్షిత 415బై440, సీఈసీలో నల్ల తేజస్విని 485బై500 మార్కులు సాధించారు. ఈసందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ సరితాదేవి, వైస్‌ప్రిన్సిపల్ నగేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

●జగిత్యాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలకు చెందిన బొజ్జ సాయి చరణ్ అను విద్యార్థి ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో 468 మార్కులు సాధించి పలువురిచే ప్రశంసలు పొందాడు.

విద్యార్థులకు మాజీ మంత్రి అభినందన

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన గూడ అక్షర ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ ఫలితాల్లో 467 మార్కులు సాధించగా మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ఇందిరాభవన్‌లో గూడ అక్షరను అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంధ్యారాణిశ్రీనివాస్, గూడ రాజిరెడ్డి, తదితరులు ఉన్నారు.

శ్రీఎస్ఎస్‌వి విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియేట్-2025 ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన శ్రీఎస్ఎస్‌వి విద్యార్థులను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అభినందించారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఎండీ రయాన్ ఖాన్ 991 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించారు.ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో లావణ్య 464, ఎస్ కీర్తి 464, సీఈసీ విభాగంలో ఎండీ ఫిరోజ్ 474, ఆకాష్ 473 మార్కులు సాధించారని ఆర్కే విద్యాసంస్థల అధినేత యాద రామకృష్ణ ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ఛైర్మెన్ యాద రామకృష్ణ ప్రిన్సిపాల్ పల్లెర్ల నరేష్‌తో పాటు కళాశాల సిబ్బంది, విద్యార్థులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో యూడైస్ సర్వే పూర్తి

●పాల్గొన్న 41 మంది డీఈడీ విద్యార్థులు ●410 పాఠశాలల్లో థర్డ్ పార్టీ పరిశీలన ● తప్పుల సవరణకు చర్యలు చేపట్టిన అధికారులు

వెల్గటూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): యూనిఫైడ్ డిస్ట్రిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ (యూడైస్ ప్లస్)లో ప్రధానోపాధ్యాయులు పొందుపరిచిన వివరాల పరిశీలనకు థర్డ్ పార్టీ విచారణ పేరిట ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన సర్వే మంగళవారంతో పూర్తయింది. జిల్లాలో ఎంపిక చేసిన 410 పాఠశాలల్లో 41 మంది డీఈడీ విద్యార్థులు ఈ నెల 16 నుంచి సర్వే చేపట్టారు. రాష్ట్రంలోని అనేక జిల్లాల నుంచి ఇచ్చిన యూడైస్ సమాచారంలో క్లారిటీ లేకపోవడంతో దేశంలో తెలంగాణ ర్యాంకు పడిపోయింది. దీంతో కేంద్రం నుంచి విద్యాభివృద్ధి కోసం రావాల్సిన నిధుల వాటా తగ్గిపోయే ప్రమాదం ఏర్పడింది. ఈక్రమంలో అప్రమత్తమైన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం యూడైస్ సర్వేను థర్డ్ పార్టీ ద్వారా మరోసారి వెరిఫికేషన్ చేసేందుకు నిర్ణయించి అమలు చేసింది. పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, కంప్యూటర్లు, సైన్స్ ల్యాబ్‌లు, విద్యుత్ సౌకర్యం, సోలార్ ప్యానెల్స్, ఫర్నిచర్, ప్లే గ్రౌండ్, చేతు లను శుభ్రం చేసుకునే వసతి, విద్యార్థుల వారీగా ఆరోగ్య రికార్డులు, కిచెన్ గార్డెన్లు, ఇంటర్నెట్, కిచెన్ షెడ్లు, ఇంటిగ్రేటెడ్ సైన్స్ ల్యాబ్‌లు, వసతి సౌకర్యాలు ఏ మేరకు ఉన్నాయనే దానిపై యూడైస్ ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేసింది. పాఠశాలల వారీగా ఉపాధ్యాయులు, విద్యార్థుల సమగ్ర సమాచారంతోపాటు కేంద్రం ఇచ్చిన ఫార్మెట్ ప్రకారం కనీస మౌలిక వసతి సౌకర్యాల వివరాలను పొందుపరిచారు.

ఆన్‌లైన్‌లో పొందుపరిచిన యూడైస్ వివరాలను క్రాస్ చెక్ చేసి వివరాలు నమోదు చేశారు. ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో యూడైస్ ప్లస్ వెబ్‌సైట్లో నమోదు చేసిన వివిధ అంశాలను పరిశీలన చేసి, తుది నివేదికను విద్యాశాఖ ఉన్నతా. దికారులకు అందించనున్నారు. ఉన్నతాధికారుల పరిశీలన అనంతరం వివరాలను ప్రధానోపాధ్యాయులు ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో సరి చేయ నున్నారు. సంబం ధిత మండలాల ఎంఇఓలు, సీసీవోలు, సీఆర్పీల ద్వారా ఆయా పాఠశాలల యూడైస్ వివరాలు పరిశీలించి సరిచేయడానికి జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు.


చెగ్యాం పాఠశాలలో సర్వే(ఫైల్)

●పకడ్బందీగా సర్వే

-ప్రభాకర్, ఎంఈవో

జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు మండలంలో థర్డ్‌పార్టీ సర్వే పకడ్బందీగా నిర్వహించాం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యా యుల సంఖ్య, పాఠశాలలో మౌలిక వసతులతో పాటు వివిధ అంశాలకు సంబంధించి ప్రధానోపాధ్యాయులు పొందుపరిచిన యూడైస్ వివరాలను సర్వే బృందం పరిశీలించారు. సౌకర్యాలు, విద్యార్థుల సంఖ్య పెరుగుదల ఉంటే యూడైస్‌లో సవరించే అవకాశం ఉంది.

మున్సిపల్ ఆర్థిక సంవత్సర బడ్జెట్ ఆమోదం

కోరుట్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ 2025-2026 ఆర్థిక సంవత్సర బడ్జెట్ పురపాల సంఘం మున్సిపల్ చట్టం 2019 సెక్షన్ 107నను అనుసరించి జారీ చేయబడిన పద్ధతుల ప్రకారం ఆర్థిక బడ్జెట్ ఆమోదం పొందినట్లు మున్సిపల్ కమీషనర్ మారుతి ప్రసాద్ బుధవారం ప్రకటించారు. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పర్యవేక్షణలో మున్సిపల్ ప్రత్యేక అధికారి లత సమక్షంలో 2025-2026 సంవత్సర వార్షిక చిత్తు బడ్జెట్ అంచానా ఆదాయ వ్యయములను మరియు 2024-2025 ఆర్థిక సంవత్సరంను సవరణ బడ్జెట్‌ను ఆమోదం తెలిపినట్లు కమిషనర్ తెలిపారు. 2025-26 సంవత్సరం బడ్జెట్ మొత్తం రూ. 3985.32 లక్షలు, ఆర్థిక సంవత్సరం కాపిట్ గ్రాండ్ రూ. 2576.46 లక్షలు, ఆర్థిక సంవత్సరం జనరల్ ఫండ్ ఆదాయం రూ. 1408.86 లక్షలుగాను ఆమోదం పొందింది. జీతాలు రూ.540 లక్షలు, పారిశుద్ధ్య ఖర్చులు రూ.153.90 లక్షలు, కరెంట్ చార్జీలు 207.60 లక్షలు, ఋణాలు చెల్లింపు రూ. 80.00 లక్షలు, హరిత హార నిర్వహనకు రూ.137.79 లక్షలు, నిర్వహణ వ్యయం రూ. 158.07 లక్షలు, మిగులు బడ్జెట్ రూ. 100.50 లక్షలుగాను అంచాల ప్రకారం బడ్జెడ్‌ను కేటాయించినట్లు తెలిపారు.

మిగులు బడ్జెట్‌లో 1/3 వంతు మౌళిక వసతుల కల్పన విలీన ప్రాంతాల అభివృద్ధి, అభివృద్ధి చెందని ప్రాంతలు బలహీన వర్గాల ప్రాంతాలు, మైనార్టీ ప్రాంతాలలో మురికి వాడల అభివృద్ధి కొరకు కేటాయింపు రూ. 33.50 లక్షలను కేటాయించినట్లు తెలిపారు. ప్రజా సౌకర్యాలు వివిధ వార్డులలో జనరల్ ఫండ్ నుండి కేటాయింపులు రూ. 67.00 లక్షలు, అభివృద్ధి కార్యక్రాలకు గ్రాంట్స్ నుండి కేటాయింపులు రూ 2576.64 లక్షలను ప్రత్యేక అధికారి సమన్వయంతో ఆమోదించినట్లు కమీషనర్ మారుతి ప్రసాద్ పేర్కొన్నారు.

●రాయికల్ పురపాలికలో..

రాయికల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మున్సిపాలిటీ 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను బడ్జెట్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆమోదించారు. మున్సిపల్ చట్టం 2019, సెక్షన్ 107 ప్రకారం 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ మొత్తం రూ.858.40 లక్షలు, 2025-26 ఆర్థిక సంవత్సరం క్యాపిటల్ గ్రాంట్స్ రూ.539.94 లక్షలు, 2025-26 ఆర్థిక సంవత్సరం జనరల్ ఫండ్ ఆదాయం రూ.314.96 లక్షలు, 2025-26 ఆర్థిక సంవత్సరం ఛార్జ్‌డ్ వ్యయం రూ.306.68 లక్షలు బడ్జెట్ ఆమోదం తెలిపినట్లు తెలిపారు.

ఇందులో జీతాలు రూ.99.60 లక్షలు, పారిశుద్ధ్య ఖర్చులు రూ.54.70 లక్షలు, కరెంట్ ఛార్జీలు రూ.37 లక్షలు, రుణాల చెల్లింపులు రూ.21.96 లక్షలు, హరితహారం రూ.31.50 లక్షలు, నిర్వహణ వ్యయం రూ.61.92 లక్షలు, మిగులు బడ్జెట్ రూ.8.28 లక్షలుగా ఉందని పేర్కొన్నారు. మిగులు బడ్జెట్‌లో 1/3వ వంతు మౌలిక వసతుల కల్పన, విలీన ప్రాంతాల అభివృద్ధి, అభివృద్ధి చెందని ప్రాంతాలు, బలహీన వర్గాల ప్రాంతాలు, మైనార్టీ ప్రాంతాల్లో, మురికి వాడలలో అభివృద్ధి కోసం రూ.2.76 లక్షలు కేటాయించారు. ప్రజా సౌకర్యాలు, వార్డులలో జనరల్ ఫండ్ నుంచి రూ.61.92 లక్షలు కేటాయించారు. అభివృద్ధి కార్యక్రమాలకు గ్రాంట్స్ నుంచి రూ.539.94 లక్షలు కేటాయించారు.

గ్రాడ్యుయేషన్ డే

రాయికల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు. చిన్నారుల్లో ప్రతిభకు మెరుగైన వేదికను అందించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయశ్రీశేఖర్, అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● సంక్షిప్తం..

●రాయికల్: మండలంలోని ధర్మాజీపేట, ఒడ్డెలింగాపూర్, బోర్నపెల్లి గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సంఘం అధ్యక్షుడు ముత్యం రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు అల్లాల అంజిత్, మల్యాల జలపతి రెడ్డి, కోల శ్రీనివాస్, పాల్గొన్నారు.

●సారంగాపూర్: సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన ఎలేటి మాదవి రాజేశ్వర్‌రెడ్డి దంపతుల కూతురు శ్రైశిత ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో రాష్ట్ర స్థాయి రెండవ ర్యాంకు సాధించగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొండ్ర రాంచందర్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత బుధవారం సన్మానించారు.

●గొల్లపల్లి: గొల్లపల్లి మండలంలోని బీమాజుపల్లి గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బొమ్మెన కుమార్, సింగారం మహేష్ పాల్గొన్నారు.

●రాయికల్: మండలంలోని వీరాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రూ.20 వేల విలువ గల టీవీని పాఠశాల ఉపాధ్యాయుడు మల్లారెడ్డి అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అంజనేయులు పాల్గొన్నారు.

●రాయికల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని, ఈ సెలవులలో తమకు నచ్చిన రంగంలో ప్రగతిని సాధించే దిశగా అడుగులు వేయాలని పాఠశాల సముదాయం ప్రధానోపాధ్యాయుడు కాపు శ్రీనివాస్ అన్నారు.